సాక్షి నిర్మల్

శుక్రవారం । 3 । మార్చి । 2023



స్వేచ్ఛగా బతుకనిద్దాం

అమాయక జీవులు జీవ వైవిధ్యంలో ప్రత్యేక గుర్తింపు గల జంతువులు.. ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు. అడవితల్లి ఒడిలో సేద తీరే వన్య ప్రాణులను స్వేచ్ఛగా బతుకనిద్దాం. 8లో▸



దేవుడి కరుణ ఎవరిపైనో..!

ఆలయాల ఆలనాపాలన చూడడంతోపాటు అభివృద్ధిలో కీలకమైన పాలక మండళ్ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ కావడంతో ఆశావహుల్లో హడావుడి మొదలైంది. నేతల ప్రసన్నం కోసం ప్రయత్నిస్తున్నారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 / 18.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పాఠశాలలను పరిశీలించిన ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి



ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రగతిని పరిశీలిస్తున్న మధుకర్‌రావు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, మన్మద్, పోట్‌పల్లి, లోకేశ్వరం గ్రామాల్లోని పాఠశాలను ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి మధుకర్‌రావు గురువారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రగతి పరిశీలనలో భాగంగా ఉపాధ్యాయుల పాఠ్యాంశ బోధనను పరిశీలించి సూచనలు చేశారు. మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు దేవీదాస్, నగేశ్ ఉన్నారు.

‘ఉపాధిహామీ’ని సద్వినియోగం చేసుకోవాలి




కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ ప్రసాద్

లక్ష్మణచాంద: ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ ప్రసాద్ సూచించారు. మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో గురువారం పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి పనికి వచ్చిన కూలీల సంఖ్య గురించి అడిగి తెలుసుకున్నారు. 400 మంది కూలీలు పనులకు వచ్చారని తెలుపగా రానున్న రోజుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఈ నెల 5న గ్రామానికి వచ్చే ట్రైనీ ఐఏఎస్‌ల విడిది కోసం గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ రాజేందర్‌యాదవ్, ఏపీవో ప్రేమల, టీఏ దినేశ్ తదితరులు ఉన్నారు.

4న ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని అభివృద్ధి పనులు పరిశీలించేందుకు ట్రైనీ కలెక్టర్ల బృందం ఈనెల 4న పర్యటిస్తుందని ఏపీడీ ప్రసాద్ తెలిపారు. ఐదు రోజులు గ్రామంలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ట్రైనీ కలెక్టర్లకు వసతి ఏర్పాట్ల గురించి సర్పంచ్ బొడ్డు గంగన్నకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సలహాలు ఇస్తున్న అంజిప్రసాద్

కుంటాల: రైతులు యాసంగి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన మధుపటేల్ నానో యూరియాతో మొక్కజొన్న సాగు చేయగా పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు అందించారు. మొక్కజొన్న, నువ్వు పొట్ట దశకు వచ్చాయని అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలని పేర్కొన్నారు. రసాయన ఎరువులు వాడడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు.. ఆయన వెంట ఏఈవో గణేశ్ ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో యాసంగి పంటలను ముధోల్ ఏరువాక శాస్త్రవేత్తలు నర్సయ్య, కార్తీక్ గురువారం పరిశీలించారు. ధర్మోరలోని మంద శ్రీధర్, మంద లింగన్నకు మొక్కజొన్న విత్తనాలను అందజేశారు. వారు సాగుచేసిన పంటను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

5న గురుకుల సీఓఈ సెట్



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌సీఓ స్వరూపారాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సీఓఈ సెట్‌ను ఈ నెల 5న నిర్వహించనున్నట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ కె.స్వరూపారాణి తెలిపారు. గురువారం బెల్లంపల్లి సీఓఈ కళాశాలకు వచ్చిన ఆమె వివరాలు వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సీఓఈ సెట్ నిర్వహణ కోసం 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో సీఓఈలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 6,719 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి పలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పూర్వవైభవం దిశగా..

- జిల్లాలో పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ దృష్టి
- నేడు భైంసా నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర
- హాజరుకానున్న రాష్ట్రస్థాయి నేతలు



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి

భైంసా/భైంసాటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి. ఈ క్రమంలో టీపీసీసీ గతంలో పార్టీ ఎక్కడెక్కడ బలంగా ఉందో అంచనాలు వేసి పూర్వవైభవం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఒకప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. అందులోనూ ముధోల్ నియోజకవర్గంలో ఈ పార్టీ నుంచే ఎక్కువసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. దివంగత నేత, మాజీ మంత్రి గడ్డెన్న ఎక్కువ పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచే గెలిచారు. అనంతరం ఆయన కుమారుడు విఠల్‌రెడ్డి 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచే ఎన్నికయ్యారు. ముధోల్ నియోజకవర్గంలో పార్టీకి బలమున్నప్పటికీ ఎమ్మెల్యేలుగా బరిలో దిగినవారంతా ఇతర పార్టీల్లో చేరారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపటేల్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రామారావుపటేల్ పోటీ చేసి ఓటమి చెందారు. తరువాత పార్టీ నాయకత్వం ఆయనకే జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. కొన్నినెలల క్రితం ఆయన పార్టీకి రాజీనామా చేసి తమ అనుచరులతో బీజేపీలో చేరారు.

పూర్వవైభవం తీసుకొచ్చేలా..

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా పార్టీ నాయకత్వం దృష్టి సారించింది. రామారావ్‌పటేల్ బీజేపీలో చేరడంతో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీకి నూతన అధ్యక్షుడిని నియమించారు. ముధోల్ నియోజకవర్గంలో పార్టీ జెండా మోస్తున్న మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి గడ్డెన్న అనుచరుడిగా నారాయణ్‌రావుపటేల్ హయాంలోనూ, రామారావుపటేల్ బరిలో దిగిన సమయంలో కాంగ్రెస్‌లోనే ఉన్నారు. పార్టీ నుంచి ఎవరు మారినా ఈయన మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. మైనార్టీ, దళిత, గిరిజనుల ఓట్లు అధికంగా ముధోల్ నియోజకవర్గంలో పార్టీ పూర్వవైభవం కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారు.

భైంసా నుంచే యాత్ర...

జిల్లాలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర జిల్లాలో భైంసా నుంచి ప్రారంభించనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ఐదోవిడత ప్రజాసంగ్రామ యాత్ర సైతం భైంసా నుంచి చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పోరుయాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించనుంది. ఈ యాత్రకు పార్టీ రాష్ట్రస్థాయి నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు హాజరుకానున్నారు.

నేటి నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర

నిర్మల్‌చైన్‌గేట్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతం అయిన సందర్భంగా దానికి కొనసాగింపుగా టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడోయాత్ర చేపట్టారని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం మాట్లాడారు. హాథ్ సే హాత్ జోడోయాత్ర కొనసాగింపుగా శుక్రవారం సాయంత్రం భైంసా నుంచి పార్టీ సీనియర్ నాయకులు యాత్ర చేయనున్నట్లు తెలిపారు. శనివారం భైంసా పట్టణంలో కార్నర్ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 5న లక్ష్మణచాందా మండలం, 6న మామడ, ఖానాపూర్ మీదుగా ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు యాత్ర చేరుకుంటుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. పెరిగిన ధరలతో ప్రజల జీవనం అస్తవ్యస్తమైందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించ లేదని తెలిపారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలోకాంగ్రెస్ నాయకులు సాధ సుదర్శన్, సరికేల గంగన్న, తక్కల రమణారెడ్డి, ఇమ్రాన్ ఉల్లా, నాందేడపు చిన్ను, జునైద్, అనంతుల అభిలాష్, తేజ, జింకసూరి, మోయిన్, సంతోష్, ప్రజ్యోత్‌రావు, గంగాధర్ పాల్గొన్నారు.

‘యాత్రను విజయవంతం చేయండి’

భైంసాటౌన్: జిల్లాలో చేపట్టనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు ముత్యంరెడ్డి కోరారు. భైంసాలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం 3 గంటలకు భైంసా నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ యాత్రకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ యాత్ర చేపడుతుందన్నారు. యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్మికులు, కర్షకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌రావుపటేల్, నాయకులు ఆలూర్ ప్రశాంత్, జయరాంనాయక్, రామేశ్వర్ దేశ్‌ముఖ్, యువజన కాంగ్రెస్ నాయకులు నవీన్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బండ భారంపై బీఆర్‌ఎస్ ఆందోళన



వంటగ్యాస్ ధర తగ్గించాలని నిర్మల్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- కేంద్ర సర్కారుపై మహిళలు, బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం
- పట్టణంలో ర్యాలీ, ధర్నా, దిష్టిబొమ్మ దహనం

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని మంత్రి కేటీఆర్ పిలుపు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కేంద్రంలో గురువారం మహిళలు, బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మయూరి హోటల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వోకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నేతలు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. గృహ అవసరాల గ్యాస్ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 350 పెంచి మధ్య తరగతి ప్రజలపై భారం మోపిందన్నారు. పెంచిన ధరలను తగ్గించకపోతే బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, పీపీ నాలం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



కడెంలో రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే, నాయకులు

కడెంలో రాస్తారోకో

కడెం: కేంద్రం వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొని మాట్లాడారు. కేంద్రం కార్పొరేట్ సంస్థల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. సామాన్యులపై భారం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తోందని విమర్శించారు.

పాలనలో మోదీ విఫలం

ముధోల్: ప్రజారంజక పాలన అందించడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ముధోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు వంటగ్యాస్ ధర పెంపుపై ముధోల్‌లో బాసర– భైంసా ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటూ మోదీ అడ్డగోలుగా ధరలు పెంచుతున్నారని తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

లోపభూయిష్టంగా ‘డబుల్’ సర్వే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్



జగన్నాథ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బాధితులు

ఖానాపూర్: డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు చేపట్టిన సర్వే లోపభూయిష్టంగా ఉందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు పలువురు సర్వేలో లోపాలను తెలియజేశారు. అధికారులు చేసిన సర్వే పూర్తిగా తప్పుడు సర్వే అని పేర్కొన్నారు. జాబితాలో అనేక మంది అనర్హులే ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లక్కీడ్రా ద్వారా ఎంపిక కానివారికి ప్లాట్లు కేటాయిస్తామని, ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్‌చైర్మన్ కలీల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విపక్షాల నిరసన..

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో నిర్మించిన 400 డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు. ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ నారాయణ నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు చిన్నం సత్యం, నాయిని సంతోష్, షబ్బీర్‌పాషా, అమానుల్లా ఖాన్, దయానంద్, నిమ్మల రమేశ్ తదితరులు ఫంక్షన్‌హాల్ వద్ద నిరసన చేపట్టారు. జాబితాలో అనర్హులకు చోటు కల్పించి అర్హులకు అన్యాయం చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి మామడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అధికారులు లక్కీ డ్రా తీశారు. దీంతో తమకు అన్యాయం జరిగిందంటూ సుమారు 300 మంది ఫంక్షన్‌హాల్‌లో అధికారులను నిలదీశారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. వారంతా స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాకు చేరుకుని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, లబ్ధిదారుల మధ్య తోపులాట జరిగింది. బాధితులు మాట్లాడుతూ, అధికారులు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసిన వారిలో సగానికి పైగా అనర్హులే ఉన్నారని తెలిపారు. వారిని జాబితా నుంచి తొలగించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు

ఖానాపూర్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో అధికార పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్ ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు దరఖాస్తులు స్వీకరించి 400 మంది అర్హులను గుర్తించినప్పటికీ అధికార పార్టీ నేతల ఒత్తిడితో రెండో విడతలో మరో 300 మందిని తమ వర్గానికి చెందిన వారిని దరఖాస్తు చేయించారని తెలిపారు. అధికారుల తీరుతో మొదటి జాబితాలోని ఎంపికైన వారిలో సగానికిపైగా అర్హులు అన్యాయానికి గురయ్యారని పేర్కొన్నారు. అధికార టీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు సహకరించేలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేసి క్రిమి నల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులకు అన్యాయం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే మాటలు బేఖాతరు



మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక సరిగా లేదని స్వయంగా ఎమ్మెల్యే రేఖానా యక్ చెప్పినా అధికారులు ఎమ్మెల్యే మాట లను బేఖాతారు చేసి లక్కీడ్రా నిర్వహించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు విమర్శించారు. పట్టణంలోని విశ్రాంత భవనంలో అర్హులైన లబ్ధిదారులతో గురువారం రాత్రి మాట్లాడారు. లక్కీడ్రాకు ముందు మరోసారి సర్వేచేపట్టాలని నిరసన చేపట్టిన ప్రతిపక్ష కౌన్సిలర్లు, నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. లబ్ధిదారుల ఎంపికపై పునరాలోచన చేయాలని, అవకతవకలకు బా ధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కా ర్యక్రమంలో చిన్నం సత్యం, దయానంద్, నా యిని సంతోష్, షబ్బీర్‌పాషా, అమానుల్లాఖా న్, మడిగెల గంగాధర్, కడార్ల గంగనర్సయ్య, మున్వర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. 40 ఏళ్లుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ సౌకర్యాలు నేటికీ కల్పించలేదన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లోలాగా అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. తమిళనాడు, కర్ణాటకలో అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించారని, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ ఇస్తున్నారని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్ పేరు టీచర్స్‌గా మార్చాలన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించాలన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దె, గ్యాస్ బిల్లులు డీఏలు చెల్లించాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.50 లక్షలు చెల్లించాలన్నారు. ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు ఒక్కరికి రూ. 10 పెంచాలన్నారు. ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, జిల్లా కార్యదర్శి లలిత, జిల్లా ఉపాధ్యక్షులు రజియా, స్వర్ణలత, శేషికాల శైలజ, భాగ్యలక్ష్మి, గంగమణి, ఠాకూర్ రాజమని, దుర్గం వందన, ప్రమీల, రాజేశ్వరి, లావణ్య, రమ్య, దేవిక, కమల, వనజ, భాగ్య పాల్గొన్నారు.

సాధన చేయండి సాయం అందిస్తాం



నిరుద్యోగ అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో మాట్లాడి గ్రంథాలయంలో సమస్యల గురించి తెలుసుకున్నారు. గ్రూప్స్‌కు సంబంధించి అభ్యర్థుల మాక్ టెస్టుల నిర్వహణ, ఎకనామిక్స్, తెలంగాణ చరిత్ర గురించి తరగతులు నిర్వహించేలా చూడాలని అభ్యర్థులు కోరారు. గ్రంథాలయ పని వేళలను పెంచాలని, అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు హాల్ నిర్మాణం వారంలోగా పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు ఎర్రవోతు రాజేందర్, కార్యదర్శి లక్ష్మీరాజం, సిబ్బంది పి.విజయ, ఆర్.మోహన్‌సింగ్, పృథ్వీరాజ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూమిలో మంత్రి ఫాంహౌస్’



ప్రహరీని పరిశీలిస్తున్న రావుల రాంనాథ్

లక్ష్మణచాంద: సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ శివారులో గోదావరి ఒడ్డున ప్రభుత్వ భూమి ఆక్రమణలను అరికట్టాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ కోరారు. గోదావరి తీరంలో రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫాంహౌస్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. గురువారం మంత్రి నిర్మిస్తున్న ఫాం హౌస్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ భూమిని కొనుగోలు చేశామని మంత్రి చెబుతున్నారని పేర్కొన్నారు. 415 సర్వే నంబర్‌లోని ఉన్నది అసైన్డ్ భూమి అని ఆ భూమిని మంత్రి ఎలా కొనుగోలు చేశారని ప్రశ్నించారు. పాక్‌పట్ల గ్రామస్తులు శ్మశానానికి వెళ్లేందుకు, పుష్కారాలకు వెళ్లడానికి వేసిన రోడ్డును కూడా ఆక్రమించి ప్రహరీ నిర్మించారని తెలిపారు. తాను భూములు ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని చెబుతున్న ఐకేరెడ్డి ఇక్కడ నిర్మిస్తున్నది భూమి ఆక్రమణ కాదా అని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి పాక్‌పట్ల గ్రామ శివారులో ఆక్రమణకు గురవుతున్న భూమిని కాపాడాలని కోరారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. ఆయన వెంట బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడు సాగర్, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: ఉపాధిహామీ, ఐకేపీ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పల్లెలు స్వయం సమృద్ధి సాధించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కొలాంగూడలో గురువారం పర్యటించారు. గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు పల్లిపట్టి యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం, ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భర్తను సస్పెండ్ చేయాలి



రాస్తారోకోలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ భర్త ఎంవీఐ శ్యాంనాయక్‌ను సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, ఎంవీఐ అవినీతి అక్రమాలను జిల్లాస్థాయి అధికారులే మూకుమ్మడిగా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నా స్పందించడం లేదన్నారు. సంబంధిత అధికారి చేసే వసూళ్లలో సీఎంకు సైతం వాటా ఉన్నట్లు ఉంద ని ఆరోపించారు. భార్య ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకుని శ్యాంనాయక్ చేస్తున్న అక్రమాలపై విచారణ చేసి ఎమ్మెల్యేను వెంటనే బర్తరఫ్ చేయాలని, శ్యాంనాయక్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చే శారు. లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. రాస్తారో కోలో ఆ పార్టీ నాయకులు భూక్యా జానుబాయి, అజ్మీరా హరినాయక్, పడాల రాజశేఖర్, టేకు ప్రకాశ్, కొడిమ్యాల లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, భూక్యా గోవింద్, ఎనగందుల రవి, ఇనుముల స్వామి, పెద్ది రమేశ్, మేకల వెంకటేశ్, దాసరి రాజేశ్వర్, గిరి, రాజేందర్, శ్రావణ్, శేఖర్, మనోజ్, పుల్లయ్య, శేఖర్‌గౌడ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిలాబాద్‌లో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం



జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.ఉమా మహేశ్వర్ తెలిపారు. దీని ద్వారా విదేశాలకు పార్సిల్స్ పంపుకోవచ్చని వివరించారు. రాష్ట్రంలో మూడు ప్రధాన తపాలా కార్యాలయాలకు ఇది మంజూరు కాగా అందులో ఆదిలాబాద్ ఒకటని పేర్కొన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యంతర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఈ కేంద్రం ద్వారా ఎంతో సులభంగా విదేశాలకు పంపుకోవచ్చని వివరించారు. https://dnk.cept.gov.in/customers.web/ కు కస్టమర్ లాగిన్ అయి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆదిలాబాద్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం పోస్టు మాస్టర్ కె.ఉత్తంను సెల్:7382070807లో సంప్రదించాలన్నారు.

పలువురిపై కేసు నమోదు

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో డబుల్‌బెడ్‌రూం కోసం గురువారం లక్కీ డ్రా నిర్వహించారు. లక్కీ డ్రాను అడ్డుకుని ఎమ్మెల్యే రేఖానాయక్ భర్త శ్యాంనాయక్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ పలువురు రోడ్డుపై బైఠాయించారు. ఇందులో బీజేపీ పార్టీ నాయకులు భుక్యా జానుబాయి, పడాల రాజశేఖర్, తోట బుచ్చన్న, అజ్మీరా హరినాయక్, జక్కుల గంగామణిలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై రజినీకాంత్ తెలిపారు.

కలప నిందితుల బైండోవర్



తహసీల్దార్ ఎదుట నిందితుడు

కెరమెరి: కలప స్మగ్లింగ్‌లో ప్రధాన నిందితులైన మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన మెడిశెట్టి మహేశ్‌ను అటవీశాఖ అధికారులు గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేశారు. మహేశ్ ఇటీవల కాలంలో రెండు కార్లలో అక్రమంగా కలపను తరలిస్తూ పట్టుబడ్డాడు. కలప అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎఫ్‌ఆర్వో అనిత హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వోలు ప్రకాశ్, సిద్ధార్థ, ఎఫ్‌బీవో ఆలీం ఉన్నారు.

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని బోయిన పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి నాలుగో తరగతి చదువుతున్న గిరిజనేతర విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి.నీలిమ, గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న శనివారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.



స్వేచ్ఛగా బతుకునిద్దాం

అమాయక జీవులు జీవ వైవిధ్యంలో ప్రత్యేక గుర్తింపు గల జంతువులు.. ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు. వాటికి కేటాయించిన స్థలంలో ఉండనిద్దాం. వాటి రక్షణకు బాధ్యతగా పాటుపడదాం. జీవ వైవిధ్యంలో ఏ ఒక్క వన్యప్రాణి అంతరించిపోయినా అనర్థాలు కలుగుతాయి. అందుకే అడవితల్లి ఒడిలో సేద తీరే వన్యప్రాణులను స్వేచ్ఛగా బతుకనిద్దాం. నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు
- సకల జీవరాశితోనే జీవవైవిధ్యం
- అంతరిస్తే ప్రకృతిపై ప్రభావం
- నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం



చుక్కల దుప్పులు

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని వివిధ అటవీ డివిజన్లలో రకరకాల వన్యప్రాణులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇందులో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, సాంబర్లు, కొండగొర్రెలు, కృష్ణజింకలు, అడవిపందులు, కుందేళ్లు, అడవికున్నలు లాంటి శాఖ జంతువులు, అడవికుక్కలు, చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు వంటి మాంసాహార జంతువులు ఉంటున్నాయి. జన్నారం అటవీ డివిజన్ వన్యప్రాణుల ఆవాసాలకు చిరునామాగా ఉంది. ప్రకృతి ఒడిలో అలరాడే అమాయక జీవులు వన్యప్రాణులు. వాటి సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొందరు తమస్వార్థం కోసం వాటిని హతమారుస్తున్నారు. జీవ వైవిధ్యంలో ఒక జంతువుపై మరో జంతువు ఆధారపడుతుంది. వన్యప్రాణులు అంతరించిపోతే ప్రకృతిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

వేట నివారణకు ప్రత్యేక నిఘా

అడవిలో ఉంటూ స్వేచ్ఛగా జీవిస్తున్న వన్యప్రాణులపై వేటగాళ్లు పంజా విసురుతున్నారు. వాటిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వేట నిర్మూలనకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వన్యప్రాణులను వేటాడిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. పలువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అంతేకాకుండా వేటాడితే ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదవుతాయి...శిక్షలు, అనర్థాలపై అటవీశాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కళాజాత బృందం సభ్యులతో వన్యప్రాణుల రక్షణపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మూడేళ్లుగా వేట తగ్గినట్లు కనిపిస్తోంది.

రాబోయే తరాలకు చూపిద్దాం

వన్యప్రాణుల రక్షణను బాధ్యతగా తీసుకుని రాబోయే తరాలకు వాటిని చిత్రాలలో కాకుండా నేరుగా చూసే అవకాశం కల్పించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉంది. వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకుందాం. అమాయకపు చుక్కల దుప్పులు, చెంగుచెంగున ఎగిరే కొండగొర్రెల ఆందాలను అంతరించిపోకుండా కాపాడుకుందాం.

గడ్డి క్షేత్రాలు, నీటి వసతులు

వన్యప్రాణుల కోసం అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టైగర్‌జోన్‌లోకి పులి ప్రవేశిస్తే సరిపడా ఆహారం అందించేందుకు రకరకాల వణ్యప్రాణుల సంతతి పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లో ఎఫ్‌డీవో మాధవరావు చొరవతో 500 హెక్టర్లలో గడ్డి క్షేత్రాలను పెంచారు. వాటికి నీటి సౌకర్యం కల్పించేందుకు 300లు నీటి కుంటలు నిర్మించారు. 20 చోట్ల సోలార్ నీటి పంపులతో కుంటలకు నీటిని వదులుతున్నారు. దీంతో వన్యప్రాణులు ఆహారం, నీరు, ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. దీంతోపాటు మూడేళ్లుగా గ్రామాల్లోని పశువులు అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పశువులు అడవిలోకి వెళ్తే వాటి అలజడికి వన్యప్రాణులు భయంతో పారిపోయే అవకాశం ఉంటుందని భావించిన అధికారులు పశువుల మేతకు ప్రత్యేక స్థలం కేటాయించారు. కోర్ ఏరియాలోకి పశువులు, ప్రజలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా రెండేళ్లలో వన్యప్రాణుల సంఖ్య రెట్టింపయ్యింది.

బాధ్యతగా తీసుకోవాలి



వన్యప్రాణులు అంతరిస్తే అనర్థాలు కలుగుతాయి. ప్రకృతిలో భాగమైన వన్యప్రాణుల రక్షణ అటవీ అధికారులే కాకుండా అందరూ బాధ్యతగా తీసుకుంటే రాబోయే తరాలకు వాటి గురించి తెలుస్తుంది. అవి స్వేచ్ఛగా జీవించేందుకు సహకరించాలి. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాటికి సరిపడా ఆహారం, నీరు, ఆవాసం ఏర్పాటు చేస్తున్నాం.

– సిరిపురం మాధవరావు , డిప్యూటీ కన్జర్వేటర్

కాంగ్రెస్ నాయకుల

ముందస్తు అరెస్ట్



చెన్నూర్‌లో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా దండేపల్లిలో గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు సాగునీరందించాలని ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ నాయకులు కుర్మ మల్లాగౌడ్, ముత్యాల బాపాగౌడ్, మహేశ్‌ప్రసాద్ తివారి ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల బైండోవర్

మందమర్రిరూరల్: మందమర్రిలో 40మంది కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి తహసీల్దార్ రాజేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రాజు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టు

లక్సెట్టిపేట: రైతులకు మద్దతుగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ తెలిపారు. అరెస్టయిన వారిలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, మండల అధ్యక్షుడు పింగళి రమేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, ఎస్సీ సెల్ కన్వీనర్ గుత్తికొండ శ్రీధర్, మాజీ ఎంపీటీసీ మడిపల్లి స్వామి, నాయకులు సూరం చంద్రమౌళి, రాందేని చిన్న వెంకటేశ్, బోద రాజు, కోల నాగు, ప్రశాంత్, హాజీ, అగ్గు లింగన్న, మూల కిషన్‌గౌడ్, పెరుగు తిరుపతి, తోట చంద్రశేఖర్, అమీర్‌ఖాన్, శాబాన్, రవి, నరసింహాచారి, అయూబ్‌ఖాన్, కాంతన్న, కాంద్ర ప్రసాద్, పెట్టం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

- జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్



పట్టుకున్న ట్రాక్టర్లతో జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్, ఆర్‌ఐ, ఎస్సైలు

బేల: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోగ్దూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దీంతో పాటు అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌గంగలో సరిపడా ఇసుక లేదని, ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులివ్వలేదని పేర్కొన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించి, అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్‌ఐ ఆనంద్‌కుమార్, ఎస్సై కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీ పతనమే

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో కేంద్ర బిల్లు ప్రవేశపెట్టకుంటే బీజేపీ పతనం కాక తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ ఆరోపించారు. వర్గీకరణపై కేంద్రం తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నుంచి ఆ సంఘం ఆధ్వర్యంలో మాదిగల సంగ్రామ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాకు మించి ఎస్సీ రిజర్వేషన్లను ఏకపక్షంగా దోచుకుంటున్న కులాలకు బీజేపీ తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మోసం చేస్తున్న బీజేపీకి మాదిగలు దూరం కానున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బీజేపీ ప్రభుత్వం మెడలు వంచేలా, మాదిగ సమాజాన్ని మరో యుద్ధానికి సిద్ధం చేయడం కోసమే ఈ మాదిగల సంగ్రామ పాదయాత్ర చేపట్టామన్నారు. నెలరోజులపాటు జరిగే ఈ యాత్ర ద్వారా ప్రజలను చైతన్యం చేసి చివరగా ఏప్రిల్ 4న హైదరాబాద్‌ను ముట్టడిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ నాయకులు కుడాల స్వామి, కాంబ్లె బాలాజీ, జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, చిట్ల రవి, ఆడిగ స్వామి, ఆరేపల్లి రాజేశ్ పాల్గొన్నారు.

ఉసురు తీసిన అప్పులు

- పురుగుల మందుతాగి రైతు బలవన్మరణం
- ఖరీఫ్‌లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తిపంట



చవాన్ రమేశ్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: పంట సాగుకు చేసిన అప్పులు తీర్చలేక రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ కథనం ప్రకారం... మండలంలోని హస్నాపూర్‌కు చెందిన చవాన్ రమేశ్(55) తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమితో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని గత ఖరీఫ్‌లో పత్తి పంట సాగుచేశాడు. పంట సాగు కోసం రూ.5లక్షల వరకు ప్రైవేటుగా అప్పులు చేశాడు. ఇటీవలి అకాల వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిని పెట్టుబడి కూడా రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై బుధవారం పంట పొలంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితుడు గజేశ్ కథనం ప్రకారం.. గజేశ్ మంచిర్యాల జిల్లాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే క్రమంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ మంచిర్యాలకు వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి గోడ పైనుంచి దూకి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని 15 తులాల వెండి, ఒక గ్రాము బంగారం ఎత్తుకెళ్లారు. గురువారం గమనించిన ఇంటి చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో బాధితుడు ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆటోను ఢీకొట్టిన లారీ

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాజులపేట్ సమీపంలో గురువారం ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌కు చెందిన హర్షిత్ ఆటోను తీసుకుని వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

బాలుడిపై కుక్కల దాడి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన దీపక్(10)పై బుధవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. సుమారు ఐదు కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన బాలుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పట్టణంలో పెరిగిపోతున్న కుక్కల బెడదను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్జీయూకేటీలో విద్యార్థులపై కుక్కల దాడి

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులపై కుక్కలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం సాయంత్రం క్యాంపస్ ఆవరణలో ఇద్దరు విద్యార్థులపై కుక్కలు దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో క్యాంపస్‌లోని ఆరోగ్యకేంద్రంలో వారికి చికిత్స అందించారు.

'108'కు జీపీఆర్‌ఎస్

- మెరుగైన వైద్యసేవలపై ప్రభుత్వం దృష్టి
- 108కి సాంకేతిక పరిజ్ఞానం
- ఆలస్యానికి చెక్ పెట్టేందుకు..



చెన్నూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవల కోసం 108 సర్వీసులు పనిచేస్తున్నాయి. మరింత వేగంగా సంఘటనా స్థలాలకు వాహనాలు చేరుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రానున్న రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొత్తం 52 వాహనాలకు జీపీఆర్‌ఎస్ సిస్టమ్ అనుసంధానం చేయనున్నారు.

ఆలస్యానికి చెక్..

ప్రమాదాలు జరిగితే ముందుగా గుర్తుకొచ్చేది 108 వాహనమే. అత్యవసర సేవలకు ప్రమాదం జరిగిన వెంటనే 108కు ఫోన్ చేస్తుంటారు. సమాచారం అందగానే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్సలు అందించి సమీప ఆస్పత్రులకు తరలిస్తారు. ఈ మధ్య కాలంలో వివిధ కారణాలతో వాహనం ఆలస్యమవుతోంది. వాహన ఆలస్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించింది. వాహనాలలో జీపీఆర్‌ఎస్ సిస్టమ్‌ను అనుసంధానం చేయడంతో వాహనం ఎక్కడ ఉందో కాల్ సెంటర్‌కు తెలిసిపోతుంది.

వాహనాలకు 5జీ సిమ్‌లు..

ఇప్పటి వరకు వాహనాలలో 2జీ సిమ్‌లు మాత్రమే ఉన్నాయి. దీంతో సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. సిగ్నల్ సమస్యను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాహనాలల్లో ఉపయోగించనున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో వాహనాలను అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను వెంటనే ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడేందుకు ఈ విధానం దోహదపడనుంది. రానున్న రెండు మూడు రోజులలో ఈ విధానం అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.

కాల్‌కు వాహన లొకేషన్..

ప్రమాదం జరిగిన వెంటనే కాల్ చేస్తే హైదరాబాద్ కాల్ సెంటర్ నుంచి సంబంధిత 108 వాహనానికి వివరాలు పంపిస్తారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంటారు. ఇందు కోసం వాహనాలకు ఆధునాతన ఫోన్‌లను ఇవ్వనున్నారు. ఎవరి ఫోన్ నుంచి కాల్ వస్తుందో వారికి లింక్ పంపిస్తారు. లింక్‌ను ఓపెన్ చేస్తే వాహనం ఎక్కడ ఉంది, వచ్చేందుకు ఎంత సమయం పట్టనుందనే సమాచారం తెలిసిపోనుంది. ఈ విధానం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు తెలిసింది. వాహనాల ట్రాకింగ్ విధానం కాల్ సెంటర్ నిర్వాహకులకు తెలియనుంది.

అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

- టీబీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్
- తెలంగాణ బచావో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కేసీఆర్ ఒకరితోనే తెలంగాణ రాష్ట్రం రాలేదని, అమరవీరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని టీబీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ అన్నారు. మార్చి 10న హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే 'తెలంగాణ బచావో' సదస్సు పోస్టర్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలో టీబీజేఎస్ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల వీరోచిత పోరాటం, ఆత్మబలిదానాలు, ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో తెలంగాణ సకల జనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కేసీఆర్ ప్రభుత్వం మరిచిపోయిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేసిన 1200 మంది అమరవీరుల కుటుంబాలను ఆదుకోకుండా 500 మందిని గుర్తించి మిగతా వారిని నిర్లక్ష్యం చేశారన్నారు. మిగిలిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాటి ఉద్యమ ఆకాంక్షలు మరచిన కేసీఆర్ ప్రభుత్వం మీద పోరాటానికి తెలంగాణ ఉద్యమకారులు పార్టీ జెండాలను పక్కనపెట్టి ఏకమై తెలంగాణను కేసీఆర్ కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజేఎస్ నాయకులు అరెపల్లి రమేశ్ కుమార్, మహిపాల్, సాయి, సాయిరాం, కృష్ణ, నరేష్, రమణ, శంకర్, విక్రమ్, సూర్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

రైతు సమాఖ్యను సందర్శించిన మహారాష్ట్ర అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న సంక్షేమ అధికారులు

ఉట్నూర్‌రూరల్: ప్రజామిత్ర రైతు సమాఖ్యను మహా రాష్ట్ర గిరిజన సంక్షేమ అధికారులు గురువారం సందర్శించారు. డాల్‌మిల్ ఏర్పాటు చేసిన విధానాన్ని తెలుసుకున్నారు. డాల్‌మిల్లును మహారాష్ట్రలో కూడా ఏర్పాటు చేసి సీసీడీ స్వచ్ఛంద సంస్థతో ప్రజామిత్ర లాగా ముందుకు నడిపించాలని కోరారు. ఈ విధానాన్ని కురిసి ఆదివాసీ మహా మండల్ నాసిక్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ బ్రహ్మణ్‌కర్ అభినందించారు. ఇందులో యవత్మాల్ జిల్లా కురిమిల మండల్ అధికారి అదావ ఠ్యార్ నిలేశ్, కేంద్ర సీసీడీ ప్రాజెక్టు మేనేజర్ విశల్ రావు, సిబ్బంది లక్ష్మీనారాయణ, ప్రశాంత్, అస్లాం, శివ పాల్గొన్నారు. పాల్గొన్నారు. సీసీడీ అకౌంట్స్ మేనేజర్ రఘు, ప్రజా మిత్ర అధ్యక్షుడు మెస్రం బాదిరావు, గణపతి, జుగాది

ఖానాపూర్‌ను వీడని ట్రాఫిక్ తిప్పలు

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డు వైడింగ్ పనుల్లో జాప్యంతో ప్రతీ రోజు ప్రజలకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. దీంతో ప్రతి రోజూ ఏదో ఓ చోట రోడ్డు ప్రమాదం జరగడం సర్వసాధారణమైంది. 10 రోజుల క్రితం స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఓ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగిపోయింది. తాజాగా గురువారం సైతం అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు-కారు ఢీకొనగా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది. దీంతో అక్కడికి చేరుకున్న స్థానికులు ఇరువురిని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు.



బస్సు-కారు ఢీకొన్న ప్రాంతంలో గుమిగూడిన జనం